

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

19 మే 2025 పేజీలు : 08






### కోవూరు నియోజకవర్గంలో..టీడీపీ బలోపేతం దిశగా..

# ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అడుగులు

- మంచి మనసు.. దాతృత్వం కలిగిన మహిళ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి
- తన పదవికి న్యాయం చేస్తూ.. ముందుకు నడుస్తున్న ఎమ్మెల్యే
- 5 మండలాల్లో అధ్యక్షులు ఎంపిక పట్ల అభినందనలు

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :**

కోవూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం దిశగాఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అడుగులు వేస్తోంది. రాజకీయాలకు కొత్తైనా.. ఎన్నికల అనంతరం ఆమె పూర్తిస్థాయి రాజకీయ నేతగా.. పరిణితి చెందిన ఎమ్మెల్యేగా మారిపోయారు. పూర్తి స్థాయిలో నేతలకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ.. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ.. స్థానిక సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. తన సొంత నిధులతోపాటు వీపీఆర్ ఫౌండేషన్ పేరుతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు నిరుద్యోగ యువతకు జాబ్‌మేళాలు ఏర్పాటు చేయడంతోపాటు తన ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వంటి కార్యక్రమాలను నిరంతరం చేపడుతూ ప్రజల్లో.. ప్రజలతో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పాత, కొత్త నేతలను కలుపుకుని వెళ్లడంతోపాటు.. పార్టీని నమ్ముకుని ఉన్నవారికి ప్రాధాన్యతనిస్తూ.. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి గుర్తింపునిస్తోంది. ముఖ్యంగా కోవూరు రాజకీయాల్లో తన మార్కు రాజకీయానికి శ్రీకారం చుట్టారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతం కోసం.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువనేత లోకేష్‌బాబు, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ల సహకారంతో.. తాజాగా కోవూరు నియోజకవర్గంలోని మండలాధ్యక్షులను నియమించి తన మార్కు చూపించారు. మండలాధ్యక్షుల నియామకంలో సామాజిక, యువత, విద్యావంతులు, పార్టీ కోసం కష్టపడి

-మిగతా 2లో

### రెడ్‌బుక్ రాజ్యాంగంతో

# అరాచకం



- ఏడాది పాలనలో హామీల అమలు ఊసే లేదు
- లేని స్కామ్‌లను సృష్టించి ప్రభుత్వ అధికారులపైనా కక్షసాధింపు
- ఏపీ వైపు చూడాలంటేనే భయపడుతున్న బ్యూరోక్రాట్స్
- వేమిరెడ్డి మైనింగ్ దోపిడీ రూ.1000 కోట్లు
- లీజు ముగిసిన మైన్స్‌లోనూ అక్రమంగా మైనింగ్ దందా
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు సైతం బేఖాతర్
- మాజీ మంత్రి, వైసీపీ పీఏసీ మెంబర్ అనిల్ కుమార్ యాదవ్ ఆరోపణ




# తెలుగు తమ్ముళ్లలో జోష్

- నగర నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు
- స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన మంత్రి నారాయణ
- జ్యోతి ప్రజ్వలన చేసి పార్టీ జెండా ఆవిష్కరించిన మంత్రి
- మినీ మహానాడులో అభివృద్ధి పనులపై ఏడు ప్రతిపాదనలు

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**


నెల్లూరు గోమతి నగర్‌లో సిటీ నియోజకవర్గ మినీ మహానాడు ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర ప్రారంభం నుంచి టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సభ ప్రాంగణం పసుపుమయంగా మారింది. ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి

-మిగతా 2లో

### పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు

# అందరం కృషి చేద్దాం

**కమిషనర్ వైఓ నందన్**



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :**

ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ దీక్ష చేసి అమరజీవిగా నిలిచిన పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ ఆకాంక్షించారు. ప్రభుత్వ నిర్దేశాల మేరకు పొట్టిశ్రీరాములు 125వ జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు బస్టాండ్ కూడలిలోని ఆయన విగ్రహానికి కమిషనర్

-మిగతా 2లో

# చెత్త సేకరణ కాంపాక్టర్స్‌ను ప్రారంభించిన మంత్రి

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :**



స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించిన ఆరు చెత్త సేకరణ కాంపాక్టర్లను మంత్రి నారాయణ ఆదివారం ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ.. 32 టన్నుల కెపాసిటీ గల నూతన కాంపాక్టర్ల వలన సాధారణ చెత్త సేకరణ వాహనాల కంటే 60 శాతం ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ నందన్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతం దిశగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అడుగులు

*(మొదటి పేజీ తరువాయి)*

పని చేయడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేశారు. అంతేకాకుండా.. ఇటీవల చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలోనూ ఓ నిర్ణయం తీసుకున్నారు. మండల అధ్యక్షులుగా గతంలో మూడు, అంతకు మించి పనిచేసిన వారిని ఎంపిక చేయవద్దని నిర్ణయం తీసుకోవడంతో.. పాత వారికి అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే భావించినా, పార్టీ తీసుకున్న నిర్ణయంతో.. అవకాశం లేకుండా పోయింది. కొత్తగా నియమించిన వారి ద్వారానే రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రశాంతిరెడ్డి ప్రణాళికలు చేస్తున్నారు. ఈ కొత్త అధ్యక్షుల ఎంపికలో అనేక ఆరోపణలు, విమర్శలు వస్తున్నా.. చేస్తున్నా.. అలా చేసేవారికి అవకాశం దక్కలేదన్న అక్కసుతోనే ఇలా ప్రచారం చేస్తున్నారన్న చర్చ కూడా నియోజకవర్గంలో జరుగుతోంది. కోవూరు నియోజకవర్గంలోని మండలాల నూతన అధ్యక్షులు ఎవరు ? గతంలో ఏం చేసేవారు ? పార్టీకి విధేయులా ? కాదా ? ఈ ఎంపిక కరెక్టేనా.. ఓసారి పరిశీలిద్దాం..

ఇందుకూరుపేట మండలం రెడ్డివర్గ ప్రాబల్యం ఉన్న మండలం. అక్కడ రెడ్డిని పెట్టాలని జిల్లాకు చెందిన ఓ రాష్ట్రస్థాయి నేత సూచనతో ఏకొల్లు పవన్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. గతంలో 25 ఏళ్లపాటు యాదవ సామాజిక వర్గం,మరో12 ఏళ్లు కమ్మ సామాజిక వర్గం వారు అధ్యక్షులుగా పనిచేశారు. టీడీపీ ఆవిర్భావం సమయంలో ఇక్కడి నుంచి రెడ్డి సమాజిక వర్గం వారే ప్రాతినిధ్యం వహించడం విశేషం. మళ్లీ ఇన్నాళ్లకు పవన్‌రెడ్డికి అవకాశం దక్కింది. బుచ్చిరెడ్డిపాళెం మండలానికి వచ్చేసరికి.. దామరమడుగుకు చెందిన బెజవాడ జగదీష్ కు అవకాశం కల్పించారు. విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐ ఉద్యమాల్లో కీలక భూమిక పోషించి, విద్యారంగంలో అనేక సంస్కరణలకు, మార్పులకు తన వంతు భూమిక పోషించారు. సమాజంలో బ్లడ్, మెడికల్ క్యాంపులు నిర్వహించి బడుగు బలహీన దళిత, గిరిజన ప్రాంతాల్లో వైద్య సహాయం చేయించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. చదువుకున్న యువతకు ఉపాధి కల్పించే జాబ్‌మేళా కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.అతడు విద్యావంతుడు. వారి తాతలు, తండ్రులు.. మొన్నటి సర్వత్రిక ఎన్నికలవరకు కమ్యూనిస్టు బ్యాక్ గ్రౌండ్.2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో అన్ని చోట్లా వైసీపీ కైవసం చేసుకున్నా.. దామరమడుగులోఫ్యాన్‌ను తిరగనివ్వలేదు. సర్పంచ్, ఎంపీటీసీ రెండూ కైవసం చేసుకోవడంలో జగదీష్ కుటుంబం కీలకపాత్ర పోషించింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు వేమిరెడ్డి ఆహ్వానం మేరకు వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ ప్రాంతంలో టీడీపీకి ఎప్పుడూ రాని మెజార్టీని వారుతీసుకొచ్చారు.

ఈ నేపథ్యంలోనే జగదీష్ కు మండలాధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. ఇక.. బుచ్చి టౌన్ గౌరవాధ్యక్షుడిగా గుత్తా శ్రీనివాసులు ని ఎంపిక చేశారు. ఈయన విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ నేపథ్యం.. ఉపాధ్యాయుడు.. ఆ తర్వాత.. ఉపాధ్యాయ సంఘ నేత.. సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు.. రెండేళ్ల క్రితం వీఆర్ఎస్ ఇచ్చేశారు. వేమిరెడ్డి, నారాయణ ఆయన్ను పార్టీలోకి తీసుకున్నారు. పార్టీకోసం కష్టపడి పని చేస్తుండడంతోపాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో.. బుచ్చి గౌరవాధ్యక్ష గౌరవం దక్కింది.

## పొట్టిశ్రీరాములు ఆశయ సాధనకు అందరం కృషి చేద్దాం

*(మొదటి పేజీ తరువాయి)*

ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అంటరానితన నిర్మూలన, సమ సమాజ స్థాపన, దళితుల దేవాలయాల ప్రవేశానికై జీవిత చరమాంకం వరకు పోరాడిన అభ్యుదయవాదని పొట్టి శ్రీరాములును కొనియాడారు.

## కనిగిరి జలాశయ బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఇటీవల కనిగిరి జలాశయం ప్రధాన కాలువలో గల్లంతై ప్రాణాలు కోల్పోయిన బాలురు నందు, చందు కుటుంబ సభ్యులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అండగా నిలిచారు. ఇటీవల బాధిత కుటుంబాన్ని పరామర్శించి 1 లక్ష ఆర్థిక సహాయం చేసిన ఆమె.. వారి కుటుంబ పరిస్థితిని గమనించి మరో లక్ష అదనపు సహాయం అందించి ఆదుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో చిన్నపడుగుపాడులో వారి ఇంటికి వెళ్లిన పెన్నా డెల్టా ఛైర్మన్ గోపిరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు మదన్‌రెడ్డి, ఇతర నాయకులు.. మృతుల తల్లిదండ్రులు గోవిందయ్య, శేషమ్మకు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని, ఎలాంటి ఇబ్బందులు తమ దృష్టికి తీసుకురావాలని వారికి భరోసా ఇచ్చారు. మంచి మనసు చాటుకున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు బాధిత కుటుంబసభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# తెలుగు తమ్ముళ్లలో జోష్

*(మొదటి పేజీ తరువాయి)*

మంత్రి నారాయణ నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొంగూరు షరిణి మాట్లాడుతూ.. కార్యకర్తల శ్రమతోనే టీడీపీ గెలుపు సాధ్యమైందని, చరిత్రలో నిలిచిపోయేలా తన తండ్రికి అఖండ మెజారిటీతో సిటీ వాసులు గెలిపించాలని తెలియజేశారు. అందరి సహకారంతో తన తండ్రి నారాయణ నెల్లూరును స్మార్ట్ సిటీగా మారుస్తారని, ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని తెలిపారు. చంద్రబాబు పాలనలో సింహపురికి మంచిరోజులు వచ్చాయని, అదేవిధంగా కార్యకర్తలకు మా కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. అందరూ హామీలిస్తారు.. అవసరం తీరాక గాలికి వదిలేస్తారు.. కానీ అండగా నిలిచిన కార్యకర్తలకు సంవత్సరానికి పది కోట్ల సొంత నిధులు ఇస్తున్న గొప్ప వ్యక్తి నారాయణ అని, కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని తెలియజేశారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి నారాయణతో తనకు 30 ఏళ్ల పరిచయం ఉందని, అయన ఇంత గొప్ప నాయకులు అవుతారని అనుకోలేదని.. ప్రజోపయోగమైన నిర్ణయాలతో జనం గుండెల్లో మంత్రి పదిలమైన స్థానం సంపాదించారన్నారు.



రాష్ట్రాన్ని దోచుకొని వైఎస్సార్సీపీ అప్పుల పాలు చేసి వెళ్లారని, రాష్ట్రానికి ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆప ద్బాంధవుడిగా మారారని, అయన పాలనలో అన్ని వ్యవస్థలు గాడిన పడతా యన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. కార్యకర్తలంటే మంత్రి నారాయ ణకు సైనికులతో సమాన మని, పని చేయించుకొని వదిలేసే రకం కాదని, కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలబడే వ్యక్తి మంత్రి నారాయణ అని తెలియజేశారు. అందుకే మంత్రి అంటే కార్యకర్తలకు అలివిగాని అభిమానం అన్నారు. అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ మా మంత్రి నారాయణ సార్.. ప్రజా సమస్యల కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ఏకైక నేత మంత్రి నారాయణ అన్నారు. రాజకీయాల్లో మంత్రి నడవడిక చూసి చాలా నేర్చుకున్నానని, నారాయణ మంత్రి కావటం రాష్ట్రానికే అదృష్టమని ఆయన తెలిపారు. అనంతరం మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ.. క్రమశిక్షణకు టీడీపీ మారుపేరు అని, మినీ మహానాడులో చేసిన ప్రతిపాదనలన్నీ అమలు చేస్తామన్నారు.



2014లో నెల్లూరు సిటీలో 5250 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, దురదృష్టం 2019లో టీడీపీ పరాజయం చెందిందన్నారు. 2024 ఎన్నికల్లో సిటీ నియోజకవర్గంలో 84 వేల ఇళ్ళు తిరిగానని, అప్పుడే ప్రజా సమస్యల గురించి తెలుసుకున్నానని, ప్రజల జీవనశైలిని చూసి అర్థం చేసుకున్నానని, పేదల పరిస్థితి చూసి చలించిపోయానన్నారు. పేదరికం నుంచి వచ్చిన నాకు ఆ ఇబ్బందులు ఎలా ఉంటాయో తెలుసు అని, ప్రభుత్వంతో పాటు తన వంతు సహాయం చేయాలని భావించానన్నారు. అనుకున్నట్టుగానే ముందుకు సాగుతున్నానన్నారు. 2014 -19లో టిడ్కో ఇళ్ళు, అన్నా కాంటీన్ల ఏర్పాటు తనకు సంతృప్తి కలిగించిందన్నారు.

ఏళ్ల తరబడి పరిష్కారం కాని భగత్‌సింగ్ కాలనీ వాసులకు శాశ్వత పట్టాలు ఇప్పించటం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అదేవిధంగా సిటీలో 5 వేల మందికి ఇంటిపట్టాల సమస్య పరిష్కారం చేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ప్రతి ఇంటికి రెండు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తామని, 15 కోట్లతో వీఆర్‌సీ హైస్కూల్‌ను దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దామని, నిరుపేద పిల్లలకు వీఆర్‌సీలో అడ్మిషన్స్ కల్పిస్తామన్నారు. సిటీలో ఏర్పాటు కానున్న ఎంఎస్ఎంఈ పార్కు ద్వారా 5 వేల మందికి ఉపాధి కల్పిస్తామని, 52 కోట్లతో పంటకాలువల ఆధునీకరణ చేస్తామని, 175 కోట్లతో జాఫర్ సాహెబ్, సర్వేపల్లి కాలువల్లో పూడికతీత పనులు చేపడతామని, అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామని, ఏవైతే మినీ మహానాడులో అభివృద్ధి పనులపై ఏడు ప్రతిపాదనలు తీసుకువచ్చారో అవన్నీ పూర్తి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ తెలియజేశారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అనూరాధ, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, సిటీ టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ధర్మవరపు సుబ్బారావు, కార్పొరేటర్లు, నాయకులు, కోఆర్డి నేటర్లు పాల్గొన్నారు.

# విశ్వసనీయతకు మరోసారి పట్టం

- కష్టకాలంలో నమ్మి వెంట నడిచిన పలువురికి కీలక పదవులు
- ఆమోద ముద్ర వేసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి







**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో విశ్వసనీయతకు మరోసారి పట్టం కట్టారు. కష్ట కాలంలో తనను నమ్మి తన వెంట నడిచిన వారిని గుర్తుపెట్టుకుని మరి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కీలక పదవులు అప్పగిస్తున్నారు. తాజాగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో దాదాపు సమానంగా కో -క్లస్టర్ ఇన్చార్జిల నియామకం దాదాపు చేపట్టారు. విశ్వసనీయత, కష్టపడేతత్వం, క్రమశిక్షణ, పార్టీ పట్ల నాయకుల పట్ల విధేయత ప్రామాణికంగా పదవులను కేటాయించారు. నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 12 మంది క్లస్టర్ నియమకాలను చేపట్టారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు అన్ని సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని పదవులను కేటాయిస్తున్నారు.

**టీడీపీ కో-క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు :** 1వ డివిజన్ కో-క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా తమ్మి శ్రీనివాసులు, 2, 12, 17వ మనుబోలు రామ్మోహన్ రెడ్డి, 18, 19, 20 షేక్ ఖాదర్ బాషా, 21, 22, 25 పిగిళం నరేష్, 23, 24 రాఘవేంద్ర రావు, 26, 27, 33 ఎల్.పి.కృష్ణా రెడ్డి, 28, 29 తిప్పిరెడ్డి మమతా రెడ్డి, 30, 31, 32 పల్నాటి మస్తాన్ నాయుడు, 34, 35, 36 చిలుకూరు లక్ష్మీ రెడ్డి, 37, 38, 41 విష్ణుప్రియ, కాకుపల్లి, మాదరాజుగూడూరు, కలివెలపాళెం, పెనుబర్తి, దొంతాలికి కుంచనపల్లి శివకుమార్, ఆమంచర్ల, ఉప్పుటూరు, కందమూరు, సౌత్మాపూరు, పాతవెల్లంటే, కొత్తవెల్లంటి, సజ్జాపురం, గొల్లకందుకూరు, పొట్టేపాళెం, కొండ్లపూడి, కొమరపూడి, దేవరపాళెం, ములుమూడికి రాపూరు శేఖర్‌ని నియమించారు.

# జనం కోసం జన విజ్ఞాన వేదిక : మహాసభలో జేవీవీ వక్తలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జనం కోసం జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని జేవీవీ వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన మర్రిపాడు యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం మండలం మహాసభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహనను పెంచుకొని ఉండి తీరాలన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నిషేధం ఎంతో అవసరంతో కూడుకున్న పని అని అన్నారు. అనంతరం ఆ ప్లాస్టిక్ వల్ల వచ్చే అనర్ధాలు గురించి వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధాన్ని విధించినప్పటికీ విచ్చలవిడిగా వాడుతున్నారే తప్ప వాటి వల్ల వచ్చే అనర్ధాలను మరుస్తున్నారన్నారు. అందువలన ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆ నిషేధంపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. జన విజ్ఞాన వేదిక జనం కోసం పలు ఉద్యమాలు చేశారన్నారు. అక్షరాస్యతతో మొదలుకొని సారా ఉద్యమం వరకు ఎంతో కృషిచేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

**నూతన కమిటీ ఎన్నిక :** ఈ మహాసభలో మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపీనాథ్, ఆరికట్ల పుల్లయ్యను, అధ్యక్షులుగా ఎంవి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా కన్నెమరకల శ్రీనివాసులు, కె.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా షేక్ రసూల్ బాబులతోపాటు మరో పదిమంది సభ్యులను నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కే.శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కొక్కంటి పోలయ్య, ఆంధ్రప్రదేశ్ జిల్లా రైతు సంఘం నాయకులు మూలివెంగయ్య, ఐద్వా నాయకురాలు మూలి ప్రమీల, మాజీ మండల వైసీపీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వేదగిరి లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహ కొండపై వెలసి ఉన్న వేదగిరి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము నందు 06-05-2025 నుండి 16-05-2025 తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. అదేవిధంగా తేది 19-05-2025 సోమవారం ఉదయం 10 గంటలకు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సభ్యులు అందరూ తప్పకుండా హాజరుకావాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి వేమూరి గోపి, ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్ రెడ్డి తెలియజేశారు.

## బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థిని విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఒకే వేదికపై చేరి తమ విద్యా సంవత్సరాలు జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒకరి కొకరు పంచుకున్నారు. అలాగే ఆనాడు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పూర్వ విద్యార్థులు తమ చదివిన పాఠశాలను మర్చిపోకుండా ఆత్మీయ సమావేశాలు నిర్వ హించుకోవడం సంతోషకరమన్నారు. అనాటి విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్న చదువు నేర్పిన గురువునారాయణను గుర్తించుకొని ఆహ్వానించి తమ గురుభక్తిని చాటుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాయబ్ రసూల్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామదేవత పోలేరమ్మకు పొంగళ్ళు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని దేకూరుపల్లె గ్రామంలో ఆదివారం గ్రామస్తులు గ్రామ దేవత పోలేరమ్మకు పొంగళ్ళు పొంగించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగలి సామాగ్రిని కొత్త బుట్టలో పెట్టుకొని బ్రహ్మోత్సవంగా బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణల అనంతరం పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు.

# నెల్లూరు నగరంలో 'మనం సైతం.. దేశం కోసం' తిరంగా ర్యాలీ

- వేలాది మంది ప్రజలు మనం సైతం దేశం కోసం అంటూ
- భారత్ మాతాకీ జై నినాదాలతో మారుమోగిన నగరం
- తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి పొంగూరు నారాయణ

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ కొడతామని చెప్పిమరీ ముష్కరుల పీచమణిచిన భారత ప్రధానికి, సైన్యానికి దేశప్రజలు అండగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం నెల్లూరు నగరంలో వేలాది మంది ప్రజలు మనం సైతం దేశం కోసం అంటూ జాతీయ పతాకాలు చేతబూని భారత్ మాతాకీ జై అని నినదిస్తూ వీఆర్సీ సెంటర్ నుండి గాంధీ విగ్రహం వరకు భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి పార్టీల నాయకులు తోడుగా యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, వివిధ వర్గాల ప్రజలు వేయి అడుగుల త్రివర్ణ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. వందేమాతరం నినాదంతో వీఆర్‌సి సెంటర్ మార్మోగింది. అనంతరం గాంధీ విగ్రహం వద్ద మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. 26 మంది అమాయక పౌరులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు కోలుకోలేని దెబ్బ కొడతామని ఆ రోజే భారత ప్రధాని చెప్పినట్లుగానే అతి తక్కువ సమయంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో చేపట్టిన భారత సైన్యం పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసిందన్నారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతుగా నిలిచే వారికి సరైన గుణపాఠం నేర్పిందన్నారు. పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టించిన త్రివిధ దళాల జవానులు అనిర్వచనీయమైన విజయం సాధించారని కొనియాడారు. అలాగే భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రభాగాన నిలపాలని కృషి చేస్తున్న భారత ప్రధానికి ఉగ్రవాదంపై పోరులో ప్రపంచం లోని అన్ని దేశాలు సంఘీభావం తెలిపాయన్నారు. దేశం కోసం ప్రాణా లర్పించిన అమరవీరులను భారత ప్రజలందరూ ఎప్పటికీ గుర్తుం చుకుంటారని తెలియజేస్తూ వారికి ఘన నివాళి అర్పించారు.



**భారత్ జోలికొస్తే తాటతీస్తాం :** నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదని, తనుకు తానుగా మరొకరి జోలికి వెళ్ళదని, కానీ తమ జోలికి వస్తే తాట తీస్తామని భారత సైన్యం నిరూపించిందన్నారు.




**విధ్వంసాలకు చిరునామా పాకిస్తాన్ :** ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశం శాంతికాముక దేశమని చేసిన చరిత్ర ఎన్నడూ లేదన్నారు. సమయంలో విధ్వంసాలకు చిరునామాగా పాకిస్తాన్ మిగిలిపోయింది అన్నారు. భారత సైనిక శక్తి ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచానికి తెలిసిందన్నారు. తిరంగా ర్యాలీలో కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనికోద్యోగులు శ్యాంప్రసాద్, కళాధర్, రత్నయ్య, కూటమి నేతలు నూనె మల్లికార్జున్ యాదవ్, గనుకుల కిషోర్, అశేష ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో అరాచకం




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగంను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు తెగబడిందని మాజీ మంత్రి, వైయస్సార్సీపీ పీఏసీ మెంబర్ పాలుబోయిన అనిల్ కుమార్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం నెల్లూరు జిల్లా వైసీపీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమం, అభివృద్ధి ఊసే లేకుండా పోయిందని మండిపడ్డారు. చంద్రబాబుకు తెలిసిందల్లా రాజకీయ కక్ష సాధింపు, ప్రతిపక్షంపై అక్రమ కేసులు, గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారుల అరెస్టులు మాత్రమేనని ధ్వజమెత్తారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా డీజీ ర్యాంకు అధికారి సహా మాజీ ఐఏఎస్‌లను కూడా వదలకుండా అక్రమ కేసులతో వేధింపులకు గురిచేస్తున్న దుర్మార్గపు పాలనను చూస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షంను అణిచివేయడానికి, తప్పుడు కేసులతో భయపెట్టడానికి చంద్రబాబు చేస్తున్న దిగజారుడు రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా, కేవలం కక్షసాధించాలనే లక్ష్యంతోనే, సంబంధం లేని అధికారులకు కూడా అవినీతి బురద అంటిస్తున్న చంద్రబాబు దాష్టికాన్ని ప్రజలు ఏవగించుకుంటున్నారు. సీఎంఓలో పనిచేసిన మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిల అక్రమ అరెస్ట్ నేడు ప్రజల్లో చర్చనీయాంశం అయ్యింది. ఆధారాలు లేకుండా అరెస్ట్ చేసి ప్రత్యర్థులను వేధించవచ్చని చంద్రబాబు మాకు నేర్పుతున్నారు. రాజకీయ నాయకులకే పరిమితమైన కేసులను అధికారుల మీద కూడా నమోదు చేసి ఏపీలో పనిచేయాలంటేనే బ్యూరోక్రాట్స్ భయపడేలా చేస్తున్నారు. రెడ్‌బుక్ పరిపాలన చూడటానికేనా ఓటేసింది అని ప్రజలిప్పుడు ఆవేదన చెందుతున్నారు.

- ఏడాది పాలనలో హామీల అమలు ఊసే లేదు
- లేని స్కామ్‌లను సృష్టించి ప్రభుత్వ అధికారులపైనా కక్షసాధింపు
- ఏపీ వైపు చూడాలంటేనే భయపడుతున్న బ్యూరోక్రాట్స్
- వేమిరెడ్డి మైనింగ్ దోపిడీ రూ.1000 కోట్లు
- లీజు ముగిసిన మైన్స్‌లోనూ అక్రమంగా మైనింగ్ దందా
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు సైతం బేఖాతర్
- మాజీ మంత్రి, పీఏసీ మెంబర్ అనిల్ కుమార్ యాదవ్ ఆరోపణ

▶▶ నెల్లూరు జిల్లాలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని చంద్రబాబు మైనింగ్ మాఫియాను పెంచి పోషిస్తున్నారు. ఈ మాఫియా కారణంగా నెల్లూరులో మైనింగ్ నిలిచిపోయి వేలాది కుటుంబాలు ఉపాధి లేక అల్లాడిపోతున్నాయి. నెల్లూరు జిల్లాలో దాదాపు 180 మైన్లు ఉంటే అందులో కేవలం 25 నుంచి 30 మాత్రమే నడుస్తున్నాయి. అది కూడా ఫైన్లు వేసిన మైన్స్ ఓపెన్ చేసి, మైనింగ్ చేస్తున్నారు. ఎటువంటి జరిమానాలు లేకపోయినా అనేక క్వారీలు ఇంకా మూతపడే ఉన్నాయి. దీనికి కారణం ఆయా క్వారీ యజమానులు ఎంపీ వేమిరెడ్డి మైనింగ్ మాఫియాను అంగీకరించకపోవడమే. వీటిని గతంలోనే అన్ని అధారాలతో సహా మీడియా ముందు చూపించడం జరిగింది. వీటిపై వారం రోజుల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని కోరినా, ఇప్పటి వరకు ఎటువంటి స్పందనా లేదు. వేమిరెడ్డి చేస్తున్న మైనింగ్ మాఫియాపై మాట్లాడితే ఆయన కంపెనీ పెట్టుకోవడం తప్పా అంటూ టీడీపీ నాయకుడు బీదా రవిచంద్రయాదవ్ వత్తాసుగా మాట్లాడారు. తాను తప్ప ఇంకెవరూ మైనింగ్ వ్యాపారాలు చేసుకోకూడదన్న ఎంపీ దురాశ కారణంగా నెల్లూరు జిల్లాలో దాదాపు 10 వేల మంది ఉపాధి కోల్పోతున్నా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించకపోవడం దుర్మార్గం కాదా? 260 మందికి పైగా క్వార్ట్జ ఎగుమతిదారులుంటే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన కంపెనీ ఒక్కటే వ్యాపారం చేయడం వెనుక మతలబు ఏంటని అడుగుతుంటే సమాధానం లేదు. ఎవరైనా ఎక్స్‌పోర్ట్ చేసుకుందామని పోతే వారిని బెదిరిస్తున్నారు. రూ.7కోట్లు ఫైన్లున్న భరత్‌బాబు చౌదరి, 30 వేల టన్నులు అక్రమ మైనింగ్ చేశాడని మాల్యాద్రి నాయుడు మీద ఈ ప్రభుత్వం రూ.3కోట్లు ఫైన్ వేసింది. ఇలాంటి వ్యక్తులతో మేము సంతోషంగా మైనింగ్ చేసుకుంటున్నామని మాట్లాడించడం హాస్యాస్పదం. ఈ మైన్లన్నీ ఓపెన్‌చేస్తే ప్రభుత్వానికి రూ. 400 నుంచి రూ.500 కోట్లు ప్రభు త్వానికి ఆదాయం వచ్చేది. ఎంపీ మైనింగ్ అక్రమాలపై నేను ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడిన తర్వాత కొంతమందిని పిలిపించుకుని మాట్లాడుకున్నారని తెలిసింది. లోకల్ మైన్లన్నీ ఎంపీ కంపెనీకి చేయాలట. ఎక్స్‌పోర్టర్ చైనా కంపెనీకి అమ్ముకుంటామని వాళ్లతో చెప్పారు. ఇదంతా నిబంధనలకు విరుద్ధమైంది. ఇదే జరిగితే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంటర్ కావడం తథ్యం.

▶▶ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ఫ్యాక్టరీ పెడతానన్నాడు. ఎప్పుడు పెడతాడు. ఎక్కడ పెడతాడో చెప్పడం లేదు. ఫ్యాక్టరీకి ఇంకా శంకుస్థాపన చేయకుండానే వేల టన్నులు చైనాకి ఎక్స్‌పోర్టు చేస్తున్నాడు. చైనాలో ఫ్యాక్టరీ పెడతాడా? పదివేల టన్నులు ఎక్సపోర్ట్ చేస్తే రూ.5కోట్లు వస్తుంది. దానికోసం వేల మంది కార్మికులను, ఎక్స్‌పోర్టర్లను, మైనింగ్ వ్యాపారులను రోడ్ల పాలు చేస్తున్నాడా? అని ఆరాతీస్తే దీనివెనుక భారీ కుట్ర దాగి ఉందని తెలిసింది. సిద్ధివినాయక, కేఎస్సార్, శోభారాణి వంటి 50ఏళ్లు పర్మిషన్ గడువు ముగిసిపోయిన ఏడెనిమిది మైన్స్, పట్టాభూములను తన గుప్పెట్లో పెట్టుకుని అక్రమంగా మైనింగ్ చేస్తున్నాడు. ఇలా ఏడాదికి రూ.250 కోట్లు చొప్పున నాలుగేళ్లలో రూ. వెయ్యి కోట్లకు పైనే దోపిడీకి స్కెచ్ వేశాడు. కేంద్ర ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వాల్సిన ఈ మైన్స్‌లో ఎంపీ ఇల్లీగల్ వ్యాపారం చేస్తున్నాడు. రూ.5కోట్లు మెషినరీ కొనుగోలు చేసి రూ.వెయ్యి కోట్లు దోచుకోవాలని భారీ స్కెచ్ వేశాడు. నేను చెప్పేవన్నీ అబద్ధాలే అయితే, ఈ మైన్స్‌తో తనకు సంబంధం లేదని, తాను నిజాయితీపరుడే అయ్యుంటే వారం రోజుల్లో సర్వే చేయించి లీజు ముగిసిన క్వారీల్లో ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టి స్వాధీనం చేసుకోవాలి. లీజు గడువు ముగిసిన భూముల్లో అక్రమ మైనింగ్ జరిగితే భవిష్యత్తులో పర్మిషన్ ఇవ్వకూడదని తెలిసి కూడా ఇష్టారాజ్యంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమ మైనింగ్ చేస్తున్నారు. కాదని నిరూపిస్తే ఎంపీకి క్షమాపణలు చెప్పడానికి నేను సిద్ధం.

▶▶ మైనింగ్‌లో జరుగుతున్న అక్రమాలను వెలుగులోకి తెచ్చిన తర్వాత సైదాపురంలో మైన్ల చుట్టూ వందల మంది పోలీసులను మోహరించారు. అక్రమ మైనింగ్ చేస్తున్న ప్రాంతాల నుంచి వాహనాలను కూలీలను తరలించారు. దానికి సంబంధించిన డ్రోన్ ఫొటోలు వీడియోలు ఆధారాలున్నాయి. అక్రమ మైనింగ్ చేసిన మెటీరియల్ మొత్తం వేలం వేసినా ప్రభుత్వానికి దాదాపు రూ.700 కోట్లు ఆదాయం వస్తుంది. అన్ని మైన్లకు అనుమతులిచ్చి వ్యాపారాలు చేసుకోనిచ్చి ఉంటే జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చేది. వేల మందికి ఉపాధి దొరికేది. ఒకే ఒక్క వ్యక్తి కారణంగా అటు ప్రభుత్వానికి ఇటు నెల్లూరు ప్రజలకు తీవ్రమైన నష్టం జరుగుతోంది. అందరికీ పనిదొరకాలి. అందరూ బాగుండాలి అనేదే నా విధానం. గత ప్రభుత్వంలో టీడీపీ వారి మీద కూడా ఎలాంటి ఆంక్షలు విధించకుండా స్వేచ్ఛగా మైనింగ్ చేసుకోనిచ్చాం. ఎవర్నీ బెదిరించలేదు. మైన్స్‌ను బ్లాక్ చేయలేదు. ఎక్స్‌పోర్టర్లను ఆపలేదు. టాప్ టెన్ ఎక్స్‌పోర్టర్ల లిస్ట్ చూస్తే అందులో టీడీపీ వాళ్లే ఎక్కువ మంది ఉంటారు. మా ప్రభుత్వ పారదర్శక విధానాలకు ఇంతకన్నా వేరే రుజువులు అవసరం లేదన్నారు.

## గ్రామాలలో జోరుగా బెల్ట్ షాపులు

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం జోరుగా బెల్ట్ షాపులు బహిరంగంగానే నిర్వహిస్తున్నారు. ఎన్నిసార్లు మహిళలు గ్రామాలలో బెల్టు దుకాణాలు ఉన్నాయి. వాటిని నియంత్రించండి బాబోయ్ అని గోజారుకున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు విఫలమయ్యారని చెప్పుకోవచ్చు ఎందుకంటే మద్యం షాపుల నుండి పట్టపగలే బెల్టు దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామాల్లో ప్రజలు ఎన్నోసార్లు విన్నవించినప్పటికీ అధికారులు చూస్తూ నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు. కావలి నియోజక వర్గంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం చంద్రబాబు బెల్ట్ షాపులను కట్టడి చేయాలి, వారి ఎంతటి వారైనప్పటికీ కూడా కఠినంగా శిక్షించాలని ఒక ప్రక్క ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే అవి ఏమీ పట్టనట్లుగా కావలి ఎక్సైజ్ అధికారులు ఉన్నట్టు సమాచారం. కావలి నియోజకవర్గంలో ఈ పది నెలల్లో బెల్ట్ షాపులలో మద్యం జోరుగా వ్యాపారం జరుగుతుందని పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చినప్పటికీ వారు మౌనంగా ఎందుకు ఉంటున్నారో.. ఏమో.. కానీ ఒక చిన్నకారు వారు ఎవరైనా వ్యాపారం చేస్తే వారిని పట్టుకు రావడం 10, 12 మద్యం సీసాలు పెట్టి పాత్రికేయులకు ఒక ప్రెస్‌నోట్‌ను పంపడం జరుగుతుంది. కానీ మద్యం వ్యాపారుల దగ్గర నేలమాముళ్ల నెలకి షుమారు 20వేల నుండి 30వేల వరకు తీసుకుంటానట్లు విశ్వసనీయ సమాచారం. కావలి చుట్టుపక్కల ప్రాంతాల్లో రాత్రి పగలు లేకుండా మద్యం ఏరులై పారుతున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు. ప్రజలు, ప్రజా సంఘాలు గ్రామాల్లో ప్రజలు తమ ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా అధిక సంఖ్యలో జరుగుతున్న బెల్టు షాపులను కట్టడి చేయాలని ప్రజలు, ప్రజాసంఘాలు, గ్రామ ప్రజలు, మహిళలు కోరుచున్నారు. ఈ మద్యం కుంభకోణంపై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ జరిపితే బాగుంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో.. ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విదుశేఖర భారతి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కావ్య పాల్గొన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. అనంతరం విధుశేఖర భారతి ఆశీర్వాదాలు ఎమ్మెల్యే తీసుకున్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గానుగ పంటపల్లెలో జరుగుతున్న సీతారాముల ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, విశేష పూజలు అలంకరణలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూరులను కళ్యాణ వేదికకు తరలించారు. పేద పండితులు శాస్త్రవేత్తంగా వేద మంత్రోచ్చా రణల మధ్య కళ్యాణ తంతును ముగించారు. అనంతరం స్వామి వాళ్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కళ్యాణోత్సవంలో భక్తులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### కనిగిరి జలాశయ బాధితులకు

## ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఇటీవల కనిగిరి జలాశయం ప్రధాన కాలువలో గల్లంతై ప్రాణాలు కోల్పోయిన బాలురు నందు, చందు కుటుంబ సభ్యులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అండగా నిలిచారు. ఇటీవల బాధిత కుటుంబాన్ని పరామర్శించి 1లక్ష ఆర్థిక సహాయం చేసిన ఆమె.. వారి కుటుంబ పరిస్థితిని గమనించి మరో లక్ష అదనపు సహాయం అందించి ఆదుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో చిన్నపడుగుపాడులో వారి ఇంటికి వెళ్లిన పెన్నా డెల్టా ఛైర్మన్ గోపిరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు మదన్‌రెడ్డి, ఇతర నాయకులు.. మృతుల తల్లిదండ్రులు గోవిందయ్య, శేషమ్మకు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని, ఎలాంటి ఇబ్బందులు తమ దృష్టికి తీసుకురావాలని వారికి భరోసా ఇచ్చారు. మంచి మనసు చాటుకున్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జలదంకి మండలం కమిటీ సమావేశం



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం కమిటీ సమావేశం తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జలదంకి మండలం, గ్రామ నాయకులు హాజరయ్యారు. జలదంకి మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఎమ్మెల్యే చర్చించారు. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ పదవులపై సమీక్షించారు. అన్ని సామాజిక వర్గాలను కలుపుకుంటూ పదవులు వచ్చేలా ప్రణాళికలు చేయాలని తెలియజేశారు. పార్టీ విధి విధానాలను తెలుసుకొని పాత, కొత్త, కలయికలు ఐకమత్యంతో మెలగాలన్నారు. అందరినీ కలుపుకొని పోతూ పార్టీని ముందుకు నడిపించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోనికి తీసుకుపోవాలని తెలియజేశారు. అనంతరం జలదంకి మండల కమిటీ పేర్లను నమోదు చేసుకున్నారు. అందరి ఆమోదంతోనే కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే దిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్‌రెడ్డి, వంటేరు జయచంద్రారెడ్డి, మునగాల తిరుముల రెడ్డి, తళ్లపనేని మధుసూదన్ నాయుడు, గోచి పాతళ వెంకట రమణయ్య, పచ్చ పెంచుల నాయుడు, కొల్లా రాదా కృష్ణ, చిత్త బత్తిన మస్తాన్ రెడ్డి, జలదంకి మండల నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆపరేషన్ సిందూర్ విజయంలో సైనికుల సాహసం ప్రశంసనీయం




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పెహల్గామ్ ఉగ్రదాడిలో బలైన భారత పౌరుల ఆత్మలకు శాంతి చేకూరేలా, వారి కుటుంబాల కన్నీటి నుండి పుట్టిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా భారత్ పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై ఘాటు ప్రతీకారం తీర్చుకుంది. ఈ సందర్భంగా భారత త్రివిధ దళాల సాహసం, ప్రధాని నరేంద్ర మోదీ ధైర్యవంతమైన నాయకత్వానికి సంఘీభావంగా, అన్నమయ్య సర్కిల్ నుంచి ముత్తుకూరు బస్టాండ్ వరకు రామలింగాపురం మండలంలో 'భారత శౌర్య తిరంగా యాత్ర' నిర్వహించారు. ఈ యాత్రను మండల అధ్యక్షుడు అడపాల మదన్ సాయి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, యాత్రలో పాల్గొన్నవారు త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ భారత సైనికుల శౌర్యానికి జేజేలు పలికారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. 'దేశ రక్షణలో మన త్రివిధ దళాల సాహసం, 'ఆపరేషన్ సిందూర్' ద్వారా చూపిన శక్తి ప్రపంచానికి స్పష్టమైంది. ఉగ్రవాద మూకల చేత మన స్త్రీల సింధూరం తుడిచిపెట్టబడినప్పుడు, వారికి గుణపాఠం చెప్పిన తీరు సైనికుల ధైర్యానికి నిదర్శనం. దేశ సమగ్రత, సార్వభౌమత్వం, సమాజంలో సమానత్వం అనే విలువలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్తాన్‌కు బోధపడింది– భారత్ జోలికి వస్తే ఏమవుతుందో' అని పేర్కొన్నారు. తిరంగా యాత్రకు ప్రజల నుంచి వచ్చిన మద్దతు దేశభక్తికి ప్రతీకగా నిలిచిందని, ఈ రకమైన యాత్రలు ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నాయని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కరణం సుభాషిని, రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు ఘంటా విజయ్ శ్రీ, మాజీ మండలాధ్యక్షుడు మస్తాన్ గౌడ్, సునీల్ రెడ్డి, మురళి, పవన్, స్థానికులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి రౌండ్ నెట్ బాల్ పోటీలలో..

# ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటికి చెందిన కందుకూరి మనో జస్వంత్, ఎస్.వెంకట విజ్ఞేష్ అనే విద్యార్థులు గోవాలో జరిగిన జాతీయస్థాయి జూనియర్ రౌండ్ నెట్ బాల్ పోటిలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించారు. మే నెల 13వ తేది నుండి 15వ తేది వరకు గోవా రాష్ట్రంలోని బిచోలిమ్, ఛత్రపతి శివాజీ మహారాజ్ మైదానంలో జరిగిన జాతీయ జూనియర్ స్థాయి రౌండ్ నెట్ బాల్ పోటిలు జరిగాయి. కందుకూరి మనో జస్వంత్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లికార్జున కుమారుడు. పట్టణంలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. ఎస్ వెంకట విజ్ఞేష్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నారు. జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించిన మనో జస్వంత్, వెంకట విజ్ఞేష్ లకు, తర్ఫీదునిచ్చిన పీడీ పచ్చా తిరుపతయ్యకు ఆత్మకూరు ప్రాంత ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# ముగిసిన వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం

▶ బ్రహ్మదేవి గ్రామస్తులు సహకారానికి కృతజ్ఞతలు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా ఎస్వీ అగ్రికల్చర్ కాలేజ్ విద్యార్థులు డాక్టర్ శాంతి డాక్టర్ జోష్ణ ఆధ్వర్యంలో వ్యవసాయ ప్రదర్శనను బ్రహ్మదేవి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం విజయవంతం అయింది. ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనలో వివిధ నమూనాలు విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. డాక్టర్ శాంతి, డాక్టర్ జోష్ణ, అగ్రికల్చర్ ఆఫీసర్ జోత్స్న రాణి, అధికార పార్టీ నాయకులు రమేష్ కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్ట్ డాక్టర్ లోకేష్ బాబు మాట్లాడారు. రైతులు, విద్యార్థులు చేసిన వ్యవసాయ ప్రదర్శనలు పరిశీలించి విద్యార్థుల ప్రతిభను మెచ్చుకున్నారు. విద్యార్థులు వారి యొక్క వ్యవసాయ ప్రదర్శన వివరించారు. రావే విద్యార్థులు అతిథులు రైతులు, గ్రామ ప్రజల సమక్షంలో వారం రోజులుగా 12 తేదీ నుంచి 18 తేదీ వరకు నిర్వహించిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంను జాతీయగీతంతో ఘనంగా ముగించారు. గ్రామస్తులు సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సౌజన్యంతో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఆదివారం నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ ఆకాంక్షించారు. స్థానిక ఆర్ఎస్ఆర్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను కమిషనర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిలోని ప్రముఖ నిర్మాణ సంస్థలతో నెల్లూరు సిటీ నియోజకవర్గ యువత కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టభద్రులైన యువత జాబ్ మేళాలోని ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తి కలిగిన ఉద్యోగాలను సాధించాలని కమిషనర్ సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం జీకే అగ్రహారం గ్రామానికి చెందిన బండారు తిరుపతిరెడ్డి, సత్యవతి దంపతుల ఏకైక కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి పరిణయ వేడుక జలదంకి మండలంలోని జమ్మలపాలెం సమీపంలో ఉన్న ఎస్‌వీఆర్ కళ్యాణ మండపం నందు జరుగుతుండగా కళ్యాణ వేదిక వద్దకు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వెళ్లి నూతన వధూవరులైన, విష్ణువర్ధన్ రెడ్డి, గీతలను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం కొద్దిసేపు బంధుమిత్రులు నాయకులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంధుమిత్రులు తదితరులు ఉన్నారు.

## బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగింపు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలం నల్ల గుండ్ల గ్రామంలోని నీలగిరి పర్వతంపై వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల తొమ్మిదవ తేదీన అంకురార్పణతో మొదలై 17వ తేదీ శనివారం ఏకాంత సేవతో ముగిశాయి. నీ బ్రహ్మోత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గాని భక్తులకు అసౌకర్యం కానీ లేకుండా సజావుగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దయవల్ల జరిగినందువల్ల ఆలయ పాలకమండలి చైర్మన్ లెక్కల చిన్న కొండారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాలకు అన్ని విధాలుగా సహకారం అందించిన విద్యుత్ శాఖ పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

## నేడే ఉదయగిరి నియోజకవర్గం టీడీపీ మహానాడు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజకవర్గం తెలుగుదేశం మహానాడు సోమవారం వింజమూరులోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం ఎదురుగానున్న ఎస్వీ కన్వెన్షన్ హాలు నందు నిర్వహించడం జరుగుతుందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. కావున నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

# పామాయిల్ సాగు రైతన్నలకు అద్భుత అవకాశం

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో పామాయిల్ సాగు రైతన్నలకు అద్భుత అవకాశాన్ని అందిస్తున్నట్లు అదేవిధంగా సాగు అధిక విస్తీర్ణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉద్యాన శాఖ అధికారి షేక్ షలీల్ తెలిపారు.

**సాగు లక్ష్యం 600 హెక్టార్లు :** వింజమూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 600 హెక్టార్లు లక్ష్యంగా మామూలు ఆయిల్ ను పండించాలని లక్ష్యంతో ఉద్యాన శాఖ ఉంది తమ పొలంలో నీటి సౌకర్యము తో పాటు డ్రిప్ సౌకర్యం కూడా ఉండాలి

**ప్రభుత్వం ద్వారా అందే సహాయం :** పామాయిల్ సాగు చేయాలని ఉత్సాహం కలిగిన రైతులకు ప్రభుత్వం ఒక హెక్టార్కు అవసరమైన 143 మొక్కలను ఉచితంగా అందిస్తుందన్నారు. ఒక్కో ముక్క ఖరీదు 193 రూపాయిలు ఉంటుందని దాని మొత్తం విలువ 27,600 అవుతుందని ఈ మొత్తాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది అన్నారు ఈ మొక్కలను 9 మీటర్ల వెడల్పు తోజాకారంగా నాటాలన్నారు. అవసరమైన మొక్కలు కలిగిరి మండలం కొత్తపేట నర్సరీ నుండి తెచ్చుకోవచ్చు అని తెలిపారు. కూలీలు ట్రాన్స్పోర్ట్ మాత్రము రైతులు భరించాల్సి ఉంది. త్రిబుల్ ఎఫ్ అథారిటీ పొందిన కంపెనీ నర్సరీ నుండి ఈ మొక్కలను తీసుకోవాల్సి ఉంది రైతు పండించిన పంటను కంపెనీవారే కొనుగోలు చేసి 15 రోజుల లోపల ఆన్‌లైన్ ద్వారా రైతు ఖాతాకు అందజేస్తారు. రైతు పండించిన పంటను ఒకచోట చేర్చేందుకు దుత్తలూరు వింజమూరు కలిగిరిలో కలెక్షన్ పాయింట్లు ఉన్నాయని ఈ ప్లాంట్ల నుండి పంటను కలెక్ట్ చేసి కంపెనీకి పంపుతారని తెలిపారు. 2027 నుండి నర్సరీతోపాటు కంపెనీగా కూడా పునః ప్రారంభం అవుతుందని అప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.



**ధర నిర్ణయం :** రైతు పండించిన పంటను ధర నిర్ణయించేందుకు మార్కెట్ ధర డిమాండు సప్లైకు సంబంధం కలిగి ఉంటుంది. కనుక ప్రభుత్వం ఉద్యాన శాఖ కంపెనీ రైతు సంఘ సభ్యులు కలిసి పామాయిల్ ధరను క్వింటాలకు నిర్ణయిస్తారు. రైతులు నిర్నితమైనటువంటి పంట కాకుండా అధికంగా పండించిన కూడా కంపెనీ వారు తీసుకోవలసి ఉంటుంది.

**▶ ప్రభుత్వ పరంగా సహాయం ▶ సాగుకు ప్రోత్సాహం**

**దిగుబడి రాక :** రైతు మొక్కలు నాటిన నాలుగవ సంవత్సరం నుండి దిగుబడి ప్రారంభమవుతుంది మొదట్లో తక్కువగా వచ్చిన ఏడవ సంవత్సరం నుండి నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది ఈ పంట సుమారు 40ు45 సంవత్సరాల వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది.

**పీడలు తక్కువ :** పామాయిల్ పంటకు చీడపీడలో తక్కువగా ఉంటాయి. ఒకవేళ చేయడలు గాని తెగుళ్లు గాని సంభవించినట్లయితే మొదట్లోనే గమనించి నియంత్రించుకోవాలి. లేనియెడల పంట తగే అవకాశం ఉంటుంది. నేటి సరఫరా కూడా తగ్గిపోకుండా సక్రమంగా చేయాలి తగినంత నీరు ఉంటేనే స్త్రీ పుష్పాలు ఎక్కువగా వచ్చి పంట దిగుబడి అధికంగా వస్తుంది. ఎరువుల యాజమాన్యం కూడా జాగ్రత్తగా చేసుకోవాలి. యాజమాన్య పద్ధతులు సక్రమంగా ఉంటేనే నాణ్యమైన దిగుబడి వచ్చి రైతు లాభాల బాటలో ఉంటాడు. ఒక హెక్టారు యాజమాన్యానికి మొక్క నాటిన మొదటి సంవత్సరం నుండి నాలుగు సంవత్సరాల వరకు ప్రభుత్వం ద్వారా 5250 వస్తుంది దిగుబడి వచ్చేంతవరకు అంతర పంటలు వేసుకుని తద్వారా ఆదాయాన్ని పొందే అవకాశాన్ని రైతులు పెంపొందించుకోవాలి.



**ధరవరలు :** ప్రస్తుతం పామాయిల్ ధర టన్ను సుమారు 20వేల వరకు ఉంది గతం కంటే ప్రస్తుత ధర ఎక్కువ ఈ ధర తగ్గకుండా ఉంది సరాసరి ఎకరాకి సంవత్సరానికి ఏడవ సంవత్సరం తర్వాత 8 టన్నులు దిగుబడి వస్తుంది పెట్టుబడి కూడా గరిష్టంగా 40,000 అవుతుంది రైతు పెట్టుబడి సక్రమంగా పెట్టి నీటి సరఫరా సక్రమంగా చేసి నాణ్యమైన దిగుబడిని పొందాలని ఉద్యాన శాఖ అధికారులు తెలియజేస్తున్నారు.


**ప్రభుత్వ లక్ష్యం :** ప్రస్తుతం పామాయిల్‌ను మనం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. నూనె గింజల నుండి స్వయం సమృద్ధి సాధించేందుకు పామాయిల్ ను ఎంపిక చేసి అభివృద్ధి పరుస్తుంది దిగుమతులను నియంత్రణ మనమే పండించుకునే విధంగా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుంది.

**దరఖాస్తు చేసే విధానం :** పామాయిల్ సాగుకు ఆసక్తి చూపే రైతులు తమ పొలానికి సంబంధించిన పట్టాదార్ పాస్బుక్కును జిరాక్స్ కాపీ బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ వన్ బి ఒరిజినల్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో ఒకటి అవి మూడు సెట్లుగా చేసుకొని ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

# శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు

## నివాళులు అర్పించిన దేవా కుమారరెడ్డి


**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆయనను నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నాడు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించాడు.తర్వాత మళ్ళీ 1941-42 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించాడు. 1946 నవంబరు 25న ఈ గాంధీ శిష్యుడు మద్రాసు ప్రొవిన్సులోని అన్ని దేవాలయాలలోనూ హరిజనులకు ప్రవేశం కల్పించాలని ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించి ఆలయ ప్రవేశం కల్పిస్తారు. జీవితం చివరిదశలో నెల్లూరులో ఆంధ్రుల చిరకాల స్వప్నమైన ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగానికి పూనుకుని, అమరజీవి అయ్యారు.ఆయన నెల్లూరు వాడు కావడం మాకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో



కోవూరు, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్‌లు ఏటూరి శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఫయాజ్, డీసీసీ ఉపాధ్యక్షులు, తలారి బాల సుధాకర్, నెల్లూరు మోహన్ రెడ్డి, పప్పర్తి గణేష్ బాబు, మీడియా ఇన్చార్జ్ హుస్సేన్ భాష, రూరల్ అధ్యక్షులు హుస్సేన్, మహిళా అధ్యక్షురాలు సయ్యద్ నసీమా, సిటీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగిరెడ్డి రాజేష్ రెడ్డి, ఫజులుద్దీన్, మంజుల, పటాన్ మస్తాన్, బుచ్చి కిషోర్, శాన్వాచ్, సుబ్బారావు, చంద్రశేఖర్ రెడ్డి, దస్తగిరి, మర్రిపాడు షబ్బీర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి ఆశయ సాధనకు కృషి చేద్దాం : చైర్ పర్సన్

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా అమరజీవి విగ్రహానికి ఆమె పూల మాల వేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి మాట్లాడుతూ.. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి చేసిన సేవలు అపూర్వ త్యాగం మనందరికీ స్ఫూర్తి దాయకం అన్నారు. బాల్యం నుంచే సత్యం, అహింస, సామాజిక న్యాయం వైపు ఆకర్షితులయి మహాత్మా గాంధీ ఆదర్శాల స్ఫూర్తితో, స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, మూడు సార్లు జైలు శిక్షను అనుభవించిన స్వాతంత్ర సమర యోధులని కొనియాడారు. దళితుల ఆలయ ప్రవేశం కోసం నెల్లూరులో ఆయన చేసిన దీక్షలు ఆయన నిబద్ధతను నిదర్శమన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు వారి ఆత్మగౌరవం కోసం డిసెంబర్ 15, 1952న ఆయన తన ప్రాణాలను త్యాగం చేసి అమరజీవిగా చరిత్ర కెక్కారన్నారు.ఆయన మరణం తర్వాత,1953 నవంబర్ 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు కేవలం రాష్ట్ర సాధనకే కాదు, సామాజిక న్యాయం, సమానత్వం, అహింస కోసం కూడా పాటుపడిన గొప్ప మానవతావాది అని ఆమె ప్రశంశించారు. ఆయన జయంతి సందర్భంగా,ఆయన ఆశయాలను స్మరించుకోవడమే కాక, వాటిని కొనసాగించే బాధ్యత మనందరిపై ఉందని గుర్తు చేశారు. తెలుగు భాష, సంస్కృతి, ఐక్యతను కాపాడుకోవడం, సామాజిక సమానత్వం మనలక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది, దేశాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా చైర్ పర్సన్ మోర్ల సుప్రజ హితవు పలికారు. ఆయన త్యాగం, నిస్వార్థ సేవ మనందరికీ ఆదర్శం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు రాచూరి సత్యం, తాళ్ల వైష్ణవి, చేనేత కార్పొరేషన్ డైరక్టర్ తాళ్ల స్వామి, తిరువీధి రాధ, రామానాయుడు, గోవిందాయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మకూరులో భారీగా తిరంగా ర్యాలీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆపరేషన్ సిందూర్ విజయాన్ని గర్విస్తూ భారత సైనికుల పరాక్రమ వీరత్వాన్ని కొనియాడుతూ ఆత్మకూరులో ఆదివారం రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి సారద్యంలో భారీగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొనగా కోలాటాలు, బాణా సంచాల మోతలతో జై భారత్, వందేమాతరం నినాదాల హోరుతో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి ఎల్ఆర్ పల్లి, బిఎస్ఆర్ సెంటర్, సోమశిల రోడ్ సెంటర్, జెఆర్ పేట, బస్టాండ్, వైశ్య బజారుల మీదుగా సత్రం సెంటర్ వరకు ర్యాలీ సాగింది. దేశభక్తికి ప్రతీకగా ఆత్మకూరు చరిత్రలో నిలిచేలా ఈ తిరంగా యాత్ర జరిగింది. తిరంగా యాత్రను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. భారతదేశం కోసం ప్రాణాలర్పించిన యుద్ధ వీరుడు మురళీ నాయక్‌కు జోహార్లు అర్పిస్తూ తిరంగా యాత్రలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముందుకు సాగారు. వేలాదిగా తరలివచ్చిన ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు, యువత, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా అందరి జెండా ఒకటే జాతీయ జెండా మనమంతా ఒకటే అందరూ భారతీయులనే దేశభక్తి ఉప్పొంగేలా భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడిస్తూ ఈ యాత్ర కొనసాగిం చారు. ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాలు చేతబట్టి ముందుకుసాగగా భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో మారుమోగిన ఆత్మకూరు పట్టణం. ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం నుంచి సోమశిలరోడ్డు, బిఎస్ఆర్ సెంటర్, బస్టాండు మీదుగా సత్రం సెంటర్ వరకు తిరంగా యాత్ర సాగించారు. ఉగ్రవాదులపై విరోచితంగా పోరాడిన సైనికులకు యావత్ భారతదేశం అండగా వుంటుందనే భరోసా ఇస్తూ దేశ ఔన్నత్యాన్ని.. భారతీయుల ఐక్యమత్యాన్ని చాటుతూ కొనసాగిన తిరంగా యాత్రలో తెలుగుదేశం నాయకులు తాళ్ళూరు గిరినాయుడు, తుమ్మల ఛంద్రా రెడ్డి, దావా పెంచల రావు, పులిమి శైలజారెడ్డి, సుంకర పెంచలచౌదరి, కేతా విజయభాస్కర్ రెడ్డి, గోపారం వెంకటరమణమ్మ, కేతా వేణుగోపాల్ రెడ్డి, బీజెపి నాయకులు కుడుముల సుధాకర్ రెడ్డి, కంది మల్లికార్జున రెడ్డి, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

# దళితుల అభివృద్ధి ఉద్యమించిన విప్లవకారుడు శ్రీ పొట్టి శ్రీరాములు

## బీజేపీ నేతల నివాళులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర చరిత్రలోనే మొదటి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని నెల్లూరు మూలపేటలో స్థాపించారు. 125 జయంతి వేడుకలు ప్రారంభం సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు మొదటి విగ్రహం వద్ద బీజేపీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ.. నెల్లూరులో1946 మార్చి నెలలో వేణుగోపాల స్వామి ఆలయంలో హరిజనుల ఆలయప్రవేశం కొరకు 9రోజులు దీక్ష చేశారు. పోలీసులు బలవంతంగా తోసుకుంటూ తీసుకెళ్లి జైలుకు పంపించారు. 1946 లోనే నవంబర్ 25వ తేదీ మద్రాస్ ప్రీసిడెన్సిలో అన్ని ఆలయాలలో దళితుల ప్రవేశం కొరకు దీక్ష చేపట్టారు. ఇది సమయం కాదని గాంధీ నచ్చచెప్పారు. 1946 డిసెంబర్ నెలలో వేణుగోపాల స్వామి ఆలయం వద్ద మరో 19 రోజుల దీక్ష చేశారు. ఆనాటి అధికారులు దళితులకు ఆలయ ప్రవేశం వారంలో ఒకరోజు మాత్రమే కల్పించారు. మరలా దీక్ష చేస్తానని చెప్పడంతో బ్రిటిష్ గవర్నమెంట్ మద్రాస్ ప్రీరెసిడెన్సిలో ఉన్న ఆలయాలలో దళితులకు ఆలయ ప్రవేశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హరిజనులకు సామాజిక అభివృద్ధి కల్పించమంటూ అట్ట మీద రాసుకొని మెడలో తగిలించుకొని 5 సంవత్సరాలు నెల్లూరులో తిరిగారు. దళితుల అభివృద్ధి కోసం ఒంటిమీద చొక్కా. కాలికి చెప్పులు లేకుండా తిరుగుతుంటే పిచ్చోడు వస్తున్నాడంటూ కొంతమంది హేళన చేసేవారు. అలాంటి గొప్ప సంఘసంస్కరణ వ్యక్తి జీవితాన్ని ప్రజలకు తెలియనీ యకుండా చేశారు. తెలుగు రాష్ట్రం కోసం అమరుడయ్యాడనే ప్రచారాన్ని మాత్రమే వెలుగులోకి తెచ్చారు. లాంగ్వేజ్ ఎమోషన్ ఇన్ పాలిటిక్స్ ఇన్ ఇండియా అనే పుస్తకంలో లిసామిచల్ బ్రిటిష్ రచయిత పొట్టి శ్రీరాములు గురించి గొప్పగా రాశారు. ఆయన అమరుడయ్యారని తెలిసి తుమ్మల వెంకట రామిరెడ్డి 1953 ప్రారంభంలోనే దళితులతో కలిసి మూలాపేటలో విగ్రహాన్ని స్థాపించారు. అమరజీవి పేరుతోపత్రికను 50 సంవత్సరాల పాటు నిర్వహించారు. మొదటి స్థాపించిన పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బీజేపీ కార్యకర్తలు నివాళులర్పించడం గర్వంగా ఉందని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మావతి నాగలక్ష్మి ఏవి సుబ్బయ్య మనో శ్రావ్య, సరస్వతి, శిరీష, చంద్ర, టి.శ్రీనివాసులు, పేట రమణయ్య, లక్ష్మణరావు, నారాయణరావు, నరాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత, నిజాయితీ, సేవకి మరో పేరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

- సేవకులకు తల్లి ప్రేమ
- సేవాగుణం కలిగిన వారికే పదవులు
- వీపీఆర్ సేవలను గుర్తు చేస్తున్న కొత్త నీరు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఇప్పట్లో రాజకీయాలు అంటే దాచుకోవటం దోచుకోవటం అనేది పరిపాటిగా మారిపోయింది. నిస్వార్ధంగా ప్రజలకు సేవ చేయాలి, సమాజానికి ఉపయోగపడాలి, అనేవారు చాలావరకు కనుమరుగయ్యారు. ఏదో సమాజసేవ అని చెప్పి రెండు ట్రస్టులు ఏర్పాటు చేసుకొని సేవలందించే వాళ్ళు కొంతమంది. కానీ నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గంలో మాత్రం సేవలకు పెట్టింది పేరు విపిఆర్ ఫౌండేషన్ లాంటి సేవాభావం కలిగిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వార్ధ రాజకీయాలకు చరమగీతం పాడుతూవివాద రహిత, అవినీతిరహిత కోవూరుగా తీర్చి దిద్దడం తోపాటు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో తొలి అడుగు వేశారు. తొలి అడుగులోనే అందరి మన్ననలు పొందారు. ఇందుకు నిదర్శంగా నాయకులతోపాటు కార్యకర్తలని క్యాడర్ని ప్రజలకు ఉపయోగపడే వాళ్ళని సేవ చేసే వాళ్ళని ఎంచుకుంటూ మరో అడుగు ముందుకు వేశారు. అదే నూతనంగా ఏర్పాటు చేసిన మండల అధ్యక్షులు నియోజకవర్గంలో మండలాలకు నూతనంగా ఏర్పాటు చేసిన మండల అధ్యక్షుల్లో ఆమె తీసుకున్న జాగ్రత్తలు ప్రశంసనీయమని చెప్పాలి. ఇందుకు ఉదాహరణ బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ అధ్యక్షులుగా నియమించిన గుత్తా శ్రీనివాసులు. ఈయన విద్యార్థి దశనుంచే సమస్యల కోసం పోరాటం చేశారు. విద్యార్థి సంఘం నాయకుడిగా ఎదిగారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకున్న ఈయన అటు నాయకత్వ లక్షణాలతో పాటు చదువును ఇష్టపడుతూ ఉపాధ్యాయునిగా దిగారు. ఉపాధ్యాయునిగా ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాడు. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నాయకత్వ లక్షణాలు ఉండడంతో ఉపాధ్యాయ సంఘ నాయకుడుగా సైతం సేవలందించాడు. అటు నాయకత్వ లక్షణాలు సేవాభావంతోపాటు తమ బిడ్డల భవిష్యత్తును ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లారు. అంతటితో తృప్తి చెందని ఆయన ప్రజలకు ఏదో చేయాలి అనే సంకల్పం తో తమ బిడ్డ ద్వారా ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు సేవ చేసేందుకు అందుబాటులో ఉండేలా ఆయన కళలను ఆయన కుమారుల ద్వారా సహకారం చేసుకునే విధంగా ముందుకు సాగుతున్నారు. అటు నాయకత్వ లక్షణాల తోపాటు, వ్యాపార రంగంలో, సేవారంగంలో చెరగని ముద్ర వేసుకున్నారు. ఇలాంటి వారికి పదవులు ఇవ్వటం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. రాజకీయాలను పక్కన పెడితే నాయకత్వ లక్షణాలతోపాటు, సేవ చేసే వారిని ప్రజలకు ఉపయోగపడే వాళ్ళని ప్రశాంతిరెడ్డి ఎన్నుకోవడంతో ప్రజలలో హర్షనీయం వ్యక్తం అవుతుంది.

# హత్యయత్నం కేసుల్లో ఇద్దరుని అరెస్ట్ చేసిన నవాబుపేట పోలీసులు




**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నగరంలోని నవాబు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య ప్రయత్నం కేసులో ఇద్దరు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టిన రెండవ నగర పోలీస్ స్టేషన్ అధికారి సీఐ వేణుగోపాల్ రెడ్డి. వివరాల్లోకి వెళితే..తమిళనాడులోని పల్లంకు చెందిన హనుమంత్ బందిపరదర్(38) అనే వ్యక్తి చెన్నై నుంచి హైదరాబాద్ తన బంధువుల ఇంటికి రైల్లో ప్రయాణిస్తూ అస్వస్థతకు గురై నెల్లూరులో రైలు దిగి మెడిసిన్ కొనుక్కోటకు 16-5-2025 రాత్రి పది గంటల సమయంలో ఆత్మకూరు బస్టాండ్ బయట వేసి ఉండగా ఇద్దరు వ్యక్తులతో మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఆ గొడవలోఆ ఇద్దరు వ్యక్తులు సదురు ఫిర్యాదుని చంపాలని నిర్ణయించుకుని రాయితో కొట్టి తీవ్ర గాయాలకు గురి చేశారు. గమనించిన చుట్టుపక్కల వారు 108కి ఫోన్ చేయగా వారు వచ్చి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా నవాబ్ పేట సిఐ జి.వేణుగోపాల్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దర్యాప్తు జరిపి ముద్దాయిలు నెల్లూరు పట్టణం వేదయపాలెంకు చెందిన బట్ట గగన్ కుమార్ (33) ముమ్మడి అన్వేష్ (20)గా గుర్తించి ఆదివారం నెల్లూరు పెద్దఆస్పత్రి దగ్గర అరెస్ట్ చేసినట్టు సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలియజేశారు.

# బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ఆదివారం హనుమాన్ జయంతి పురస్కరించుకొని కావలిలో హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా శోభాయాత్ర ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ గ్రౌండ్ వద్ద నుంచి పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ముసునూరు ఆంజనేయ స్వామి గుడి వరకు యాత్ర సాగింది. ఎమ్మెల్యే బైక్ నడిపి ర్యాలీని ఉత్సాహపరిచారు. విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్, బిజెపి, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన హనుమాన్ శోభాయాత్రలో వేలాదిగా హిందూ ప్రజలు పాల్గొన్నారు. జై హనుమాన్ జై శ్రీరామ్ అంటూ నినాదలతో పురవీధులలో మారు మ్రోగాయి. అడుగడుగునా కాషాయ జెండాలతో కావలి రేపరేప లాడింది. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాలు, పట్టణ ప్రజలు భారీగా సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన చెత్త సేకరణ కాంపాక్టర్స్‌ను ప్రారంభించిన మంత్రి నారాయణ



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ద్వారా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు కేటాయించిన ఆరు చెత్త సేకరణ కాంపాక్టర్లను మంత్రి నారాయణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 32 టన్నుల కెపాసిటీ గల నూతన కాంపాక్టర్ల వలన సాధారణ చెత్త సేకరణ వాహనాల కంటే 60 శాతం ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ నందన్, తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాడు వైద్యాధికారికి జేవీవీ సన్మానం




**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు వైద్యాధికారి గోపీనాథ్‌ను ఆదివారం జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన మర్రిపాడు వైద్యశాలలో ఆయన చేస్తున్నటువంటి సేవలను గుర్తించి జెవివి మండల మహాసభలో శాలువాతో సత్కరించారు. వైద్యశాలలోనే ఉంటూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న గోపీనాథ్‌ను కొనియాడారు. వైద్యశాలకు వెళ్లినటువంటి వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేయడమే కాకుండా అత్యవసర సమయాల్లోనూ ఉపయోగపడటం గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రసవాల దగ్గర నుంచి గుండెపోటు వరకు ప్రథమ చికిత్సలు అందిస్తూ సాధ్యమైనంత వరకు వైద్య సేవలు అందించడంలో ఘనత సాధించినందుకు ఆయనను సన్మానించారు. వైద్య సేవలు అందించడమే కాకుండా అవసరమైతే ఆ వ్యాధిగ్రస్తులతో పాటు ప్రథమ చికిత్స చేయించుకుంటూ వేరే వైద్యశాలలో చేర్పించుకునే వరకు వెంట ఉండడం విశేషం అన్నారు. మెట్ట ప్రాంతానికి ఇటువంటి వైద్యాధికారి ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు గంగవరపు శ్రీనివాసులు నాయుడు, కొక్కంటి పోలయ్య, ఎంవి సుబ్బారెడ్డి, మూలి వెంగయ్య సభ్యులు పాల్గొన్నారు.

# జూన్ నుంచి రైతులకు అన్నదాత సుఖీభవ

- వ్యవసాయ శాఖకు కొత్త కళ
- ఐదేళ్ల తర్వాత రైతులకు సబ్సిడీపై పరికరాలు
- రూ.2లక్షలకే రూ.10లక్షల విలువైన డ్రోన్
- అర ఎకరం ఉన్న రైతుకు కూడా రూ.20వేలు
- ప్రతి రైతు 20వ తేదీ లోపు సచివాలయానికి వెళ్లి అన్నదాత సుఖీభవ జాబితాలో పేరును నమోదు చేసుకోవాలి
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ శాఖతో పాటు యాంత్రీకరణ పథకాన్ని కూడా నిర్వీర్యం చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. తోటపల్లి గూడూరు మండలం వరిగొండ గ్రామపంచాయతీలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ శాఖ తిరిగి గాడిలో పడింది అన్నారు. గత ప్రభుత్వం మూలన పెట్టిన పథకాలన్నింటిని తమ కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోందన్నారు. నెల్లూరు జిల్లాలో సుమారు రూ.3.25 కోట్లతో 1451 మంది రైతులకు పవర్ స్ప్రేయర్లు, బ్రష్ కట్టర్లు, కల్టివేటర్లు, రొటావేటర్లను రైతులకు సబ్సిడీపై అందజేస్తున్నామన్నారు. 80 శాతం సబ్సిడీతో డ్రోన్లు పంపిణీ చేసే కార్యక్రమానికి కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టామన్నారు. రూ.10లక్షల విలువైన డ్రోన్‌ను రూ.8లక్షలు సబ్సిడీ పోను కేవలం రూ.2లక్షలకే తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. జిల్లాలో రూ.4.10కోట్ల విలువైన 41 డ్రోన్లను అందించబోతున్నారు. ఇందులో భాగంగా రైతులకు రూ.3.28కోట్ల సబ్సిడీ లభించనుందన్నారు. గత ప్రభుత్వం మూసేసిన వ్యవసాయ శాఖతో పాటు ఇరిగేషన్ శాఖను కూడా గాడిలో పెడతామని, అన్నదాత సుఖీభవ పథకాన్ని జూన్ నుంచి తమ ప్రభుత్వం అమలు చేయబోతోందని తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.6వేలు ఇస్తే, జగన్మోహన్ రెడ్డి రూ.7 వేలు రాష్ట్ర నిధులు కలిపి రూ.13వేలను రైతుభరోసాగా రైతులకు అందించారని, కూటమి ప్రభుత్వంలో కేంద్రం ఇచ్చే రూ.6వేలకు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలు కలిపి ప్రతి రైతుకు రూ.20వేలు అందించబోతోందని తెలిపారు. జూన్‌లోనే తల్లికి వందనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రానుందన్నారు. గత ప్రభుత్వం చేసిన పాపాల కారణంగా రాష్ట్రం ఆర్థికంగా కుదేలైపోయిందని, ఇటువంటి పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతోందని, ప్రతి రైతు సచివాలయానికి వెళ్లి అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల జాబితాను పరిశీలించుకోవాలని మే 20వ తేదీ లోపు పేర్లు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జాఫర్, సాహెబ్, కాలువ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, విజయ డైరీ డైరెక్టర్ కోడూరు శ్రీనివాసరెడ్డి (చిన్నబాబిరెడ్డి), సన్నా రెడ్డి, సురేష్ రెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, చింతా సీతారామయ్య, జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏడిఏ రాజ్ కుమార్, ఎంఏఓ శిరీష రాణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు

## మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** రాజధాని అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహానికి సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. వచ్చే ఏడాది మార్చి 16 వరకు అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు నిర్వహిస్తూ ఉండడం సంతోషంగా ఉందన్నారు. నెల్లూరు నగరంలోని పప్పుల వీధి ఎస్బిఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం శ్రీ పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమరజీవి 125వ జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలు వేసి ఆయన నివాళులర్పించారు. అనంతరం మంత్రి నారాయణను వ్యాపార సంఘాలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అమరజీవి ఏవి జీవిత చరిత్ర అందర్నీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. అమరజీవి జయంతి ఉత్సవాలు 2025 మార్చి 16 నుండి 2026 మార్చి 16 వరకు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అమరజీవి గాంధే వాదని తెలిపారు. మూడుసార్లు జైలుకు కూడా వెళ్లారని.. తెలుగు రాష్ట్రం కోసం 58 రోజుల నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయులైన కొనియాడారు. దళితుల ఆలయ ప్రవేశం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని.. అన్ని తరాలు గుర్తు పెట్టుకోవాల్సిన త్యాగశీలి అని ఆయన తెలిపారు. అందులో ఆయన నెల్లూరు జిల్లా వాసి కావడం మనకెంతో గర్వకారణం అని తెలిపారు. రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారన్నారు. 22 ఎకరాల్లో ఇండియాలో బెస్ట్ మార్కెట్‌ను 9వ డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ఆ మార్కెట్ కూడా పొట్టి శ్రీరాములు మార్కెట్‌గా నామకరణం చేస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులందరూ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

# మురళీ నాయక్ కు శ్రద్ధాంజలి ఘటించిన గిరిజన విద్యా చైతన్య వేదిక



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన మురళి నాయక్ త్యాగం మరవలేనిదని గిరిజన విద్యా చైతన్య వేదిక నాయకులు పులి చెంచయ్య పేర్కొన్నారు. నెల్లూరు బోడిగాడితోట గిరిజన కాలనీలో మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పెహల్గామ్ ఉగ్రదాడికి సమాధానంగా ప్రధానమంత్రి ఆపరేషన్ సింధూర్‌లో 14 మంది పాకిస్తాన్ తీవ్రవాదులను హతమార్చి పాకిస్థాన్ ముష్కరులు చేతిలో అమరుడైన భారతమాత ముద్దుబిడ్డ, యువతకు స్ఫూర్తి, నిజమైన దేశ సేవకుడు మురళీ నాయక్ అని యాకసిరి లోక్ సాయి కొనియాడారు. స్థానిక గిరిజన నాయకులు బాలజీ, స్థానిక మహిళలు, పెద్దలు, పిల్లలు ఎక్కువ మంది పాల్గొని పూలమాలలు వేసి హృదయపూర్వక శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ విభాగానికి అధికారులు కావలెను



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో ముఖ్యంగా సిటీ ప్లానింగ్ అధికారి, డిప్యూటీ సిటీ ప్లానింగ్ పోస్ట్, ఒక అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. దీంతో ఈ విభాగంలో ఎవరికి వారే అన్నట్లుగా ఉంది. టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ పోస్టు భర్తీకి నోచుకోలేదు. కొందరు వార్డు సచివాలయం ప్లానింగ్ కార్యదర్శులను ఇన్ చార్జి టిపిబిఓలుగా అధికారులు నియమించారు. నగరంలో నిర్మాణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే అధికారుల కొరత వల్ల పూర్తిస్థాయిలో వాటి పై పర్యవేక్షణ లేకుండా పోయిందని పలువురు అంటున్నారు. ఇక్కడున్న డిప్యూటీ సిటీ ప్లానర్ విశాఖపట్నం కు బదిలీ కావడంతో ఆ స్థానంలో ఎవర్ని నియమించలేదు. నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ హిమబిందును నగరపాలక సంస్థ ఇన్చార్జి సిటీ ప్లానర్‌గా నియమించారు. ఇతర ప్రాంతాల నుంచి నెల్లూరు నగర పాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగానికి వచ్చేందుకు ఎవరు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. నగరపాలక సంస్థలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అధికారులు నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో ఉన్న సిబ్బందినైనా నియమించి టౌన్ ప్లానింగ్‌లో సిబ్బంది కొరత లేకుండా చూడవలసిన అవసరం ఉంది. ఇకనైనా నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో సిబ్బంది కొరత లేకుండా నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సిబ్బందికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించ వలసిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

## వీఆర్ హైస్కూల్ ఆధునీకరణ

# పనులను పరిశీలన మంత్రి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని వీఆర్ హైస్కూల్లో త్వరలో ప్రారంభం కానున్న హై స్కూల్ పనులను రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, కూతురు షరిణితో కలిసి ఆదివారం పరిశీలించారు. ముందుగా మంత్రి నారాయణ కూతురు షరణి మాట్లాడుతూ.. ఈ ఏడాది నూతనంగా అత్యాధునిక వసతులతో పేద విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతోపాటు ఎంత అవసరమని గుర్తించి వారికి ఇండోర్ ప్లే ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్లే గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణంలో మార్పులు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లుగా మూతబడ్డ వీఆర్ హై స్కూల్‌పై మంత్రి నారాయణ ప్రత్యేక దృష్టిపెట్టారు. దేశంలోనే మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పిల్లలకి చదువులతోపాటు ఆటలు కూడా ముఖ్యం అన్నారు ఆహ్లాదభరిత వాతావరణం ఉంటే పిల్లలు చదువుల్లో రాణించగలరని చెప్పారు. పాఠశాల అంటే అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉండాలని సూచించారు. అందుకు తగ్గట్టుగా వీఆర్ హై స్కూల్ సిద్ధమౌతోందని పేర్కొన్నారు. జూన్ 12వ తేదీన ప్రారంభం అవుతుందని చెప్పారు. చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న పి4 కింద నేను కూడా కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకొంటానని వివరించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. విఆర్సీకి పూర్వ వైభవం తెస్తానని ఎన్నికల్లో మాట ఇచ్చానని ఇచ్చిన మాట నిలబెట్టుకొంటున్నానని తెలిపారు. మంత్రి లోకేష్ ఆమోదంతో 15 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. నిరుపేద పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసేలా స్కూల్ ని డిజైన్ చేశామని చెప్పారు. ఏడాదికి వెయ్యి మంది చొప్పున ఐదేళ్లలో ఐదువేలమంది పేదపిల్లలకి అడ్మిషన్ కల్పిస్తామని అన్నారు. అన్ని సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తామని అవసరమైతే పి4 తో పేరెంట్స్‌కి అండగా నిలబడతామని చెప్పారు. వీఆర్సీలో చేరబోయే పేద విద్యార్థుల్లో కొందరిని నాకూతురు షరిణి పి4 కింద దత్తత తీసుకోవటం గర్వంగా ఉందని అన్నారు.